TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 88 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.23.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## ప్రభుత్వాస్పత్రుల్లో అందరికీ కార్పొరేట్ వైద్యం




మెదక్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించడం ప్రభుత్వ ధ్యేయమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత హెల్త్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. స్వయంగా మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సమాజ బాధ్యతతో ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. ఎంతటి వైద్యం అయిన జిల్లా కేంద్రాల్లోనే చికిత్స అందించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీసు కుటుంబాల కోసం ప్రత్యేకంగా హెల్త్ క్యాంపు నిర్వహించటం చక్కని ఆలోచన అని, ఈ క్యాంపులో 13 రకాల వైద్య నిపుణులైన డాక్టర్లు పాల్గొంటున్నారని అన్నారు. రాష్టంలో 160 డయాలసిస్ సెంటర్లు ఉన్నా సరిపోవడం లేదని, అందుకే ప్రతి 30 కి.మీకి ఓ డయాలసిస్ సెంటర్ ఉండేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే, హైవేలపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి గోల్డెన్ అవర్‌ను దృష్టిలో పెట్టుకొని హైవేలపై త్వరలో 80 ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాకో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసి కిమోథెరఫీ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి వాటికి అనుసంధానంగా 600 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో మెడికల్ కాలేజీ, 500 పడకల ప్రభుత్వాస్పత్రి, పారామెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్ బ్లాక్, అందోల్‌లో నర్సింగ్ కాలేజీ, 5 కొత్త పీహెచ్‌సీలను, మూడు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బిల్డింగ్‌లను ప్రారంభించామన్నారు. వట్‌పల్లిలో సీహెచ్‌సీ, తెల్లాపూర్‌లో యుపీహెచ్‌సీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పటాన్ చెరు, నారాయణఖేడ్ ఏరియాస్పత్రుల్లో డయాలసిస్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశామని, మరో మూడు సబ్ హెల్త్ సెంటర్లను మంజూరు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, ప్రముఖ వైద్యులు కిరణ్ కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్లు రాజు గౌడ్, సెక్రెటరీ ఆనంద్, శ్రీధర్, శ్రీహరి, జిల్లా పోలీస్ అధికారులు, వారి కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## నవంబర్ 1న దళితుల ఆత్మగౌరవ మహాయాత్ర



హిమాయత్ నగర్ :అమృత్ తెలంగాణ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయ్ పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయనందుకు నిరసనగా నవంబర్ 1న హైదరాబాద్‌లో 'దళితుల ఆత్మగౌరవ మహాయాత్ర' నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజేఐపై దాడికి వ్యతిరేకంగా తాము నిర్వహించే కార్యక్రమం యావత్ ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసే విధంగా ఉంటుందని అన్నారు.

గవాయ్ పై దాడి జరిగి 15 రోజులు దాటినప్పటికీ ఇంత వరకు నిందితుడిపై కేసు నమోదు చేయకపోవడం, అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. గవాయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన తరువాత కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను గౌరవించాలన్నారు. నవంబర్ 1న బషీర్‌బాగ్‌లోని డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఈ మహాయాత్ర ప్రారంభమై ట్యాంక్‌బండ్ వద్ద డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 32 ఏండ్ల జైలుశిక్ష




నల్లగొండ: అమృత్ తెలంగాణ: బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి ఒడిగట్టి.. ఆ తర్వాత బలవంతంగా పెండ్లి చేసుకుని వదిలేసిన నిందితుడికి 32 ఏండ్ల జైలు శిక్ష, రూ.75 వేల జరిమానా విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు బుధవారం సంచలన తీర్పు ఇచ్చింది. దాంతోపాటు బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశించినట్టు ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. పానగల్లుకు చెందిన నిందితుడు గురిజాల చందు నల్లగొండ టౌన్‌కు చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడి చేశాడు. ఆ తర్వాత బలవంతంగా పెండ్లి చేసుకుని వదిలేశాడు. దీనిపై బాధిత కుటుంబం నుంచి ఫిర్యాదు అందడంతో 2022లో నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురిజాల చందుపై పోక్సో యాక్టు 2012 సెక్షన్ 9 ప్రకారం.. చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్టు 2006 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు సేకరించి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ కోర్టు లైంగికదాడులు.. పోక్సో కేసు కింద చందును నిందితునిగా నల్లగొండ అడిషనల్ జడ్జి–2 నిర్ధారించింది. 20 ఏండ్లపాటు జైలు, రూ.25 వేల జరిమానా, సెక్షన్ 366 ఐపీసీ ప్రకారం పదేండ్లపాటు జైలు, రూ.25 వేల జరిమానా, బాల్యవివాహాల నిషేధ చట్టం కింద రెండేండ్లపాటు జైలు, రూ.25 వేల జరిమానా విధించింది.

## మాజీ సీఎం కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ




మర్కుక్ : అమృత్ తెలంగాణ: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రోడ్ షోలు, ప్రచార వ్యూహాలపై, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం.. జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఎలా చేస్తున్నారు.. ఓటర్ల నాడీ ఎలా ఉంది అని కేసీఆర్ ఆరా తీసినట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ ప్రచారం, 40 మంది బీఆర్ఎస్ స్టార్ కంపైనర్ల ప్రచార తీరుపై చర్చ సాగినట్టు తెలిసింది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి దక్కించుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తెలియజేయాలని బీఆర్ఎస్ నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నట్టు సమాచారం. దీనికితోడు జూబ్లీహిల్స్ ఇన్‌చార్జిలతో ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కేసీఆర్ పాల్గొంటారన్న చర్చ కూడా జరుగుతోంది.

## ఇరుముడితో 18 మెట్లెక్కిన రాష్ట్రపతి



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: శబరిమలలో అయ్యప్పస్వామిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె అక్కడికి వెళ్లారు. పంబానుంచి సన్నిధానం వరకూ తన అత్యవసర వాహనంలో ప్రయాణించారు. అనంతరం ఆలయ పవిత్రత, ఆచారాలు, సంప్రదాయాలప్రకారంఆమెఅయ్యప్పస్వామినిదర్శిం చుకున్నారు. ఇరుముడితో 18 మెట్లెక్కి ఆలయ ఆచారాలు, తాంత్రిక నియమాలకునుగుణంగా స్వామి వారికి రాష్ట్రపతి ముర్ము పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను రాష్ట్రపతికి శబరిమల ప్రధాన అర్చకుడు, ఇతర ఆలయ అధికారులు అందజేశారు. అయ్యప్ప సేవలో పాల్గొన్న తొలి మహిళగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలవడం విశేషం.

## జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా



అమృత్ తెలంగాణ: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2లోని 38 ఎకరాల భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. 2008లో రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్‌ఎండీఏ కస్టడీలో ప్రభుత్వం ఉంచిన విషయం విదితమే. అయితే, ఈ కేటాయింపులపై కొంతమంది కోర్టుకెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో కేసు నడుస్తుండగానే.. మరోవైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆ యూనియన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంతమంది ఇండ్లు కట్టుకుని ఉండగా, వాటి జోలికి వెళ్లకుండానే ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయని, ఈ లోగా ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అలాగే అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్ ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు.

# విద్యార్థులు పాఠశాల చదువుతో పాటు ఆరోగ్యపరమైన అలవాట్లను కూడా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.






అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన "ఆరోగ్య పాఠశాల" సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోందని, రక్తహీనత, ఐరన్ మాత్రల ప్రాధాన్యం వంటి అంశాలపై చైతన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతి నెల పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు కూడా ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 23 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని గుర్తించామని, వాటి నిర్మాణానికి ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరులు చేసినట్లు తెలిపారు. విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీంసరి పాఠశాల ఉపాధ్యాయుడు నీలం వెంకట్ రచించిన ఇంగ్లీష్ కవితను విద్యార్థులు నేహా, ప్రణవి పఠించారు. విద్యార్థులు ఆరోగ్య పాఠశాల ద్వారా పొందిన ప్రయోజనాలను పాటలు, ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. అలాగే విద్యార్థులకు ప్రశంషా పత్రాలను కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆరోగ్య పాఠశాల ఇన్నోవేషన్ ఛాలెంజ్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు కలెక్టర్ నగదు పురస్కార ప్రొసీడింగ్ ఉత్తర్వులను అందజేశారు.

TGMS జైనథ్, గుడిహత్నూర్ పాఠశాలలకు చెరో రూ.50,000/-,

ZPHS పిప్పార్ వాడ పాఠశాలకు రూ.25,000/-,

ZPSS బోరిగాం పాఠశాలకు రూ.50,000/-,

ZPHS రణదీవెనగర్ పాఠశాలకు రూ.75,000/- చొప్పున నగదు పురస్కారాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేత




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పర్యాటకంపై ఆసక్తి పెంపొందించేందుకు గత నెల 19వ తేదీన జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్, ఉపోద్ఘాతం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటకం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి సౌందర్యం, జలపాతాలు, గిరిజన సంస్కృతి, చారిత్రక ప్రదేశాలు పర్యాటక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఈ సంపదను తెలుసుకొని ప్రపంచానికి పరిచయం చేసే దిశగా ఆలోచించాలని తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి రవికుమార్, గైడ్ లింగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. విగ్రహ నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నమూనాలో, అత్యంత నాణ్యంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరగాలన్నారు. నిర్ణీత గడువులోగా విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నాణ్యత తో చేపట్టాలి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





ఇళ్లను పరిశీలిస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి, అవసరమైన సవరణలపై సూచనలు చేశారు. భవన నిర్మాణం నాణ్యవంతంగా, సమయానికి పూర్తి కావాలని, సరిపడినంతమంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు. భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమనికలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగాల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. నిరుపేద లబ్ధిదారుల తమ సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్, డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపీడీవో గజానన్, హౌసింగ్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లు, హాస్టళ్లలో భోజన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి....

## కుంటాల ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, ....





పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా కుంటాల అక్టోబర్ 21 అమృత్ తెలంగాణ కుంటాల మండలం కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై , నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు, మధ్యాహ్న భోజనం నాణ్యత, సామగ్రి నిల్వలను పరిశీలించారు. తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులను మాత్రమే వంటకు వినియోగించాలని సూచించారు. స్కూళ్లు, వసతి గృహాలు, భోజనం మెరుగ్గా అందేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. టాయిలెట్స్ రూమ్స్

మరియు విద్యుత్ సంబంధిత సమస్యలు ప్రధాన ఉపాధ్యాయులు ఎమ్మెల్యే రామారావు పటేల్, కు విన్నవించగా జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తప్పవు - ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.

**మావల పోలీస్ స్టేషన్ కేసు ఘటనలో వ్యక్తుల మొబైల్ ఫోన్ల లో ఎలాంటి అస్లీల, అభ్యంతరకర ఫోటోలు లేవు.**

**మొబైల్ ఫోన్లలో మహిళల న్యూడ్ ఫోటోలు ఉన్నాయంటూ అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవు.**

**అసత్య ప్రచారాలు సోషల్ మీడియా లో మరియు వాట్సాప్ నందు చేసిన వారిపై, అడ్మిన్లపై చర్యలు .**

**బాధితులు ఎవరైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చు.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : రెండు రోజుల క్రితం మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో ఎవరైనా దుష్ప్రచారాలు చేసిన మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. వ్యక్తుల మొబైల్ ఫోన్లలో ఎలాంటి మహిళల అస్లీల ఫోటోలు ఉన్నాయంటూ సోషల్ మీడియా నందు లేదా వాట్సాప్ ల నందు దుష్ప్రచారం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. మహిళలు లేదా బాధితులు ఎవరి కారణంగానైనా బాధింపబడినట్లైతే నిర్భయంగా జిల్లా పోలీసులు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని ఫిర్యాదులు చేయవచ్చని వారిపై కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. మహిళల న్యూడ్ ఫోటోలు మొబైల్ ఫోన్లో ఉన్నాయని విషయం అవాస్తవం, వాటిని పూర్తిగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. మహిళలు ఎవరి చేత అయిన సోషల్ మీడియా లో గానీ, నేరుగా గానీ బాధింపబడినట్లైతే, వేధింపులకు గురైనట్లయితే, బ్లాక్ మెయిల్ కి గురైనట్లయితే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించాలని, నేరస్థలను గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ విషయంపై వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరైనా ధర్నాలకు ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.




అదిలాబాద్ డిఎస్పి జీవన్ రెడ్డి

# ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలి

## . ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,....



పభుత్వం అందిస్తున్న సబ్సిడీ చెనీగే విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ముధోల్ అక్టోబర్ 21 అమృత్ తెలంగాణ ముధోల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయం నందు మరియు బాసర మండల కేంద్రంలోని రైతు వేదిక నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ (%చీఖీూవీ%) లో భాగంగా యాసంగి పంట కోసం సబ్సిడీపై శనగ ఎన్ బి ఈజీ 47 వెరైటీ విత్తనాలు పంపిణీ ప్రారంభించిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరకు విత్తనాలను కొని మోసపోవద్దు అని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి విత్తనాలను ప్రతి ఒక రైతు సద్వినియం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిట్ చైర్మన్ సిందే ఆనంద్ రావ్ తదితరులు పాల్గొన్నారు

# కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన

ముధోల్ : అమృత్ తెలంగాణ: మండలంలోని గన్నోర,రువ్వి గ్రామాలలో బుధవారం ఏఈవో రుషికేశ్ రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన కల్పించారు. పత్తి రైతులకు సీసీఐ అందించే మద్దతు ధరను పొందేందుకు కపాస్ కిసాన్ యాప్ ను గురించి వివరించారు. ఈ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేసుకుంటేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. పత్తి నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ. 8110 వరకు మద్దతు ధర లభిస్తుందన్నారు.. రైతు లు తమ సమీప సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించి మద్దతుధర పొందాలని, యాప్ డౌన్ లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుల తదితరులు పాల్గొన్నారు.



# కొమరం భీమ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం..



జన్నారం : అమృత్ తెలంగాణ: జల్, జంగిల్, జమీన్ నినాదంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరుడు. ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన యోధుడు స్వేచ్ఛ సమానత్వం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుడు గోండుల గుండె ధైర్యం ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీమ్ అని జన్నారం ఎఎంసి చైర్మన్ దుర్గమ్మ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ అన్నారు. బుధవారం కొమరం భీం జయంతి సందర్భంగా మండలంలోని ఇంధన్ పల్లి చౌరస్తా వద్ద ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరం భీం అడుగుజాడల్లో నడుస్తూ అతని ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మామిడిపల్లి ఇందయ్య, కంటెం శంకర్, అజ్మీరా నందు నాయక్, ముత్యం సతీష్, రియాసత్ అలీ, బాదావత్ సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహణ

పాల్గొన్న 400 మంది పోలీసు అధికారులు, సిబ్బంది.
ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహణ.
పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా నుండి మొదలై అంబేద్కర్ చౌక్ నందు పూర్తి.
పాల్గొన్న జిల్లా మహిళ పోలీస్ సిబ్బంది మరియు రెండవ బెటాలియన్ పోలీసు సిబ్బంది.
అమరవీరుల స్మృతిలో పోలీసు యంత్రాంగం.
అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమరవీరుల చిత్రపటాల వద్ద జిల్లా ఎస్పీ ఘన నివాళులు.







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : అమరవీరులను స్మరిస్తూ అక్టోబర్ 21 ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం సాయంత్రం 7:30 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తానందు జిల్లా పోలీసులు, పట్టణ పోలీసు అధికారులు మరియు రెండవ బెటాలియన్ అధికారుల సమన్వయంతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ర్యాలీ లో ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది క్యాండిల్ ని చేతున పట్టుకొని అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగించారు. ప్రస్తుత జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి పోలీసు అమరవీరుల త్యాగ ఫలితమే కారణమని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమరవీరుల చిత్ర పటాల వద్ద క్యాండిల్ ర్యాలీని ముగించి నివాళు లర్పించడం జరిగింది. ర్యాలీ అంతట అమరవీరులను స్మరిస్తూ, వారి త్యాగాలను స్మరిస్తూ, జోహార్ జోహార్ అంటూ అమరవీరులకు నినాదాలు చేస్తూ కొనసాగింది, అంబేద్కర్ చౌరస్తానందు పూర్తయింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీ లు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, రెండవ బెటాలియన్ సిబ్బంది అధికారులు, పట్టణ సీఐలు ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరానికి భారీ స్పందన – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు భారీ ఎత్తున మెగా రక్తదాన శిబిరం నిర్వహణ.
జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 817 మంది ప్రజలు, యువత, పోలీసులు.
స్వయంగా రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ
ఒకప్పటి పోలీసు ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ప్రశాంత జిల్లా కు కారణం.
అత్యవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడేది రక్తం, రక్తదానం మహోన్నతమైనది.
ప్రజారక్షణకై పండుగలను సైతం త్యాగం చేస్తూ విధి నిర్వహణలో ఉండే వ్యవస్థ పోలీసు వ్యవస్థ.
రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరానికి భారీ ఎత్తున స్పందన లభించిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు ఏర్పాటు చేయబడిన రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, భారీ ఎత్తున ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అమరవీరుల జ్ఞాపకార్థం వారు చేసిన సేవలను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ రక్తదాన శిబిరాలలో దాదాపు జిల్లా వ్యాప్తంగా 817 యూనిట్ల రక్తాన్ని పోలీసులు, ప్రజలు, ఔత్సాహికుల రక్తాన్ని రిమ్స్ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా రక్తదానాన్ని చేసి సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవడం జరిగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ స్వయంగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా అమరవీరుల సమస్మరణ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఒకప్పటి పోలీసులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు సవివరంగా వివరించి పోలీసులు చేసే విధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణ కి కారణమని గుర్తు చేశారు. ప్రజలు పోలీసు అమరవీరులను స్మరిస్తూ ఉండాలని తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. వృత్తిరీత్యా పోలీసులు ఉన్నతమైన వ్యక్తిత్వ భావాలు కలవారని, వారిని ప్రజలు గౌరవించాలని, రాత్రనకా, పగలనకా, పండుగలు, కుటుంబ సభ్యులను విడిచి, ప్రజా ధన ప్రాణ మాన రక్షణలో 24 గంటలు పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో ఉంటారని తెలిపారు. జిల్లా అభివృద్ధి పథంలో వెళ్లడానికి సంఘవిద్రోహశక్తులు ఆటంకాలుగా మారుతారని, మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి సంఘవిద్రవశక్తులతో పోరాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. రక్తదానం శిబిరం పెద్ద ఎత్తున ప్రజలు పోలీసు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డాక్టర్లు, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, కమతం ఇంద్ర వర్ధన్, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిమ్స్ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రజలు, యువజన సంఘాలు, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ తెలంగాణ డివిజన్ ఇంచార్జ్, మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ పుట్టినరోజు వేడుకలు



మెట్ పల్లి: అమృత్ తెలంగాణ అక్టోబర్ 22 టీయూడబ్ల్యూజే(ఐజేయు) ప్రింట్ మీడియా మెట్ పల్లి ఉపాధ్యక్షులు,అమృత్ తెలంగాణ రిపోర్టర్ జంగం విజయ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అందరూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు ,ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బూరం సంజీవ్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ ఉపాధ్యక్షులు అఫ్రోజ్, జాయింట్ సెక్రెటరీ పింజరి శివ, కార్యవర్గ సభ్యులు పొన గని మహేందర్ సభ్యులు ఆగ సురేష్, తెలుకంటి గంగాధర్ భూరం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టాపూర్ లో కొమురం భీమ్ జయంతి వేడుకలు




మల్లాపూర్ అమృత్ తెలంగాణ అక్టోబర్ 22 మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని నాయికపు పోడు సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గోండు తెగకు చెందిన భీమ్ తెలంగాణ విముక్తి కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాడని ఆయన ఆశయాల కోసం ,ఆది వాసుల హక్కుల కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు ఈ కార్య క్రమంలో నాయికపు సంఘ సభ్యులు పాల్గొన్నారు

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



జగిత్యాల అమృత్ తెలంగాణ అక్టోబర్ 22 అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను జగిత్యాల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు,4గురు మహారాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు, జగిత్యాల, నిజామాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో చోరీలకు పాల్పడిన దొంగల ముఠా నుంచి 24.5 గ్రాముల బంగారం, రూ.19 వేల నగదు, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, అరెస్ట్ వివరాలను మీడియా సమావేశంలో డీఎస్పీ రఘు చందర్ వెల్లడించారు.




విజయ్ అన్న ఒక సైన్యం,విజయ్ అన్న ఒక ధైర్యం, విజయ్ అన్న ఒక విజయం . అన్న మీరు నిండు నూరేళ్ళు ఆయు:రారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు నీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు అన్న..

# పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం

**పోలీసుల సేవలు, త్యాగాలు విద్యార్థులకు స్ఫూర్తి**

**సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, భరోసా సేవలపై విద్యార్థులకు అవగాహన**

**పోలీసుల పనితీరు, సాంకేతిక పరికరాల పరిచయంతో విద్యార్థుల్లో ఉత్సాహం**

**జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్**






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : పోలీస్ అమరవీరుల దినం (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఈరోజు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థినీ%-%విద్యార్థులు పాల్గొన్నారు.వారికి పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, సైబర్ నేరాల గురించి, గంజాయి వాడకం పై కలిగే అనర్థాలు, పోలీసు విధులు,షీ టీమ్, భరోసా, సెక్యూరిటీ, ఆంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగాలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. పోలీస్ స్టేషన్‌లో పని చేసే ప్రతి సిబ్బంది విధులు, బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఎలా ఫిర్యాదు ఇవ్వాలి, ఆ ఫిర్యాదు తర్వాత ఏ శాఖ ఎలా విచారణ జరుపుతుందన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. కొన్ని పరికరాల పనితీరును ప్రాక్టికల్‌గా చూపించారు. డయల్ 100 విధానం గురించి, బాధితులు కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారన్న విషయాలను కూడా క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, ఆయుధాల వినియోగం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేష్ మీన, ఐపీఎస్ విద్యార్థులకు ఆయుధాలు, పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యం, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాల అవగాహన అంశాలను వివరిస్తూ మార్గదర్శనం చేశారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు ం ఏకే-47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9%ఎఎ% పిస్టల్ ం అలాగే బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీ టీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు, స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ కిట్లు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిరోధక పరికరాలు, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ం పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చట్టాన్ని గౌరవిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనీ, సైబర్ నేరాల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల రక్షణకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, గంజాయి/డ్రగ్స్ ప్రమాదాలు, డయల్ 100, సైబర్ నేరం ఫిర్యాదు నంబర్ 1930 వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజేష్ మీన, ఐపీఎస్ తో పాటు రూరల్ ఇన్స్పెక్టర్, ఆర్ ఐ రమేష్,ఎస్ఐలు,ఏఆర్ సిబ్బంది, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


# "విద్యుత్ పట్టణ బాట"

## విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



జగిత్యాల, అమృత్ తెలంగాణ అక్టోబర్ 22: విద్యుత్ శాఖ అవగాహన ఆధ్వర్యంలో విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా 'విద్యుత్ పట్టణ బాట' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తైసిల్ చౌరస్తా వద్ద విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఇనుప వైర్లపై బట్టలు ఆరబెట్టడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్లాస్టిక్ వైర్లు వాడాలని అధికారులు సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, వారు 24/7 అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ADE జవహర్ లాల్, ఏఈ సతీష్, అనూష, ప్రకాష్, ఉదయ్, శ్రీనివాస్, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ACS రాజు, మాజీ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ MD సెమియోద్దీన్, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన ప్రజలకు అండగా ఉంటా



కుభీర్ :అమృత్ తెలంగాణ: ముధోల్ నియోజక వర్గంలో ఉన్న బడుగు బలహీన ప్రజలకు అండగా ఉండేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కుభీర్ లోని రైతు వేదికలో 101మంది కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కు ల మండల నాయకులతో కలసి పంపిణి కార్యక్రమంలో పాల్గొని చెక్కను పంపిణి చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముధోల్ నియోజక వర్గంలో ఉన్న అన్ని గ్రామాల అభివృద్ధి కి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అదే విదంగా దక్షణ తెలంగాణా రాష్ట్రములో ఉన్న ప్రసిద్ధి గాంచిన బాసర సరస్వతి దేవస్థానానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. దింతో పాటు బాసర నుంచి మహూర్ వరకు రెండు వరసల రహదారి నిర్మించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు చ్వేపట్టడం జరిగిందని అన్నారు.ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందె పథకాలు ప్రజలకు అందించేందుకు నవంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చెర్మన్ ఆనంద్ రావు పటేల్ బీజేపీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బషీర్ బైంసా ఆత్మ కమిటీ చేర్మెన్ సిద్ధం వివేకానంద సీనియర్ నాయకులు సౌంలీ రమేష్ బంక బాబు యువ నాయకులు పురం శెట్టి రవికుమార్ మండల తహసీల్దార్ శివరాజ్ ఎంపీడీఓ సాగర్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు కళ్యణ్ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.





# తల్లైనా తగ్గేదేలేదు.. ..



కన్నడ బ్యూటీ ప్రణీత అందం..అభినయం చూసి టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవుతుందని భావించారంతా. ఆ తరహాలో కొన్ని సినిమాలు చేసింది. స్టార్ హీరోలతో తెరను పంచుకోవడంతో ఆరోజు కాకపోతే తర్వాతైనా పెద్ద స్టార్ కాకుండాపోతుందా? అని ఓ సెక్షన్ ఆడియన్స్ విశ్వసించారు. కానీ అది జరగలేదు. 'బావ' సినిమాతో లాంచ్ అయిన బ్యూటీ అటుపై ఆరేడు సినిమాలు చేసి టాలీవుడ్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఎక్కడ నుంచైతే వచ్చిందో మళ్లీ అక్కడికే తిరోగమనం చెందాల్సి వచ్చింది. మధ్యలో బాలీవుడ్..కోలీవుడ్ లో కొన్ని సినిమాలు చేసింది. కానీ మాతృభాషలో దక్కిన గుర్తింపు ఇంకె భాషలో దక్కలేదు. ఈ క్రమంలో వ్యాపార వేత్త నితిన్ రాజు తో ప్రేమలో పడింది. కొన్నాళ్ల పాటు ప్రేమ అటుపై పెళ్లి సంగతి తెలిసిందే. ఇటీవలే ఓ బిడ్డకి జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రణీత సినిమా కెరీర్ ముగిసినట్లే అని అంతా భావించారు. పెళ్లైంది. ..పిల్లకి తల్లైంది ఇక కుటుంబ జీవితానికే అంకితమవుతుందని భావించారు. కానీ అమ్మడు మ్యాకప్ వేసుకోవడం లో వెనుకడుగు వేయలేదు. పెళ్లి చేసుకున్నా సినిమాల్లో కొనసాగింది. భర్తని ఒప్పించి తనకిష్టమైన రంగం వైపు రాణించాలనే కొర్కెను నెరవేర్చుకుంటుంది. మరోవైపు సోషల్ మీడియా వేదికగా సెగలు తగ్గలేదు. ఎప్పటికప్పుడు ఇన్ స్టా వేదికగా హాట్ ఫోటోలతో వెడెక్కిస్తూనే ఉంది. తల్లి అయింది కాబట్టి ఈసారైనా ఆ వేగం తగ్గుతుందని అంతా భావించారు. కానీ తగ్గేదేలే అంటూ దూసు కుపోతుందని తాజా ఫోటో చూస్తే అర్ధమవుతుంది. బీచ్ లో బికినీలో దిగిన ఓ ఫోటో ఒకటిప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. బ్లాక్ కలర్ హాట్ బికినీ లో అలా వాక్ చేసుకుంటో వస్తోన్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# తమన్నా ఇదే కరెక్ట్ రూట్ అనుకుంటే మాత్రం..!


సౌత్ లో అలాంటి క్రేజ్ సంపాదించుకున్న అతి తక్కువ భామల్లో మిల్కీ బ్యూటీ తమన్నా కూడా ఉంటుంది. రెండు దశాబ్దాల నుంచి కథానాయికగా రాణించడం అన్నది చాలా పెద్ద టాస్క్. సౌత్ లో అలాంటి క్రేజ్ సంపాదించుకున్న అతి తక్కువ భామల్లో మిల్కీ బ్యూటీ తమన్నా కూడా ఉంటుంది. శ్రీ సినిమాతో మొదలైన ఆమె కెరీర్ ఇప్పటికీ తన పాత్రలతో అలరిస్తుంది. సినిమా పట్ల తమన్నాకి ఉన్న ప్యాషన్, అంకిత భావమే ఆమెను ఇక్కడిదాకా తీసుకొచ్చిందని చెప్పొచ్చు. ఒకప్పుడు స్టార్స్ అందరితో కలిసి నటించిన తమన్నా ఇప్పుడు సెలెక్టెడ్ సినిమాలు చేస్తుంది. బాలీవుడ్ లో వెబ్ సీరీస్ లతో కూడా అలరిస్తున్న అమ్మడు సౌత్ లో మాత్రం తన మార్క్ చాటే సినిమాలను ఎంపిక చేసుకుంటుంది. లేటెస్ట్ గా తమన్నా ఓదెల 2 సినిమాలో నటించింది. అశోక్ తేజ డైరెక్ట్ చేసిన ఈ సినిమాకు సంపత్ నంది అన్నీ తానై నడిపించాడు. ఓదెల కమర్షియల్ ఫ్యాక్టర్స్ ని పక్కన పెడితే తమన్నా చేసిన ఈ అటెంప్ట్ కి ఆడియన్స్ ఇంప్రెస్ అవుతున్నారు. అంతేకాదు తమన్నా ఈ రూట్ లోనే వెళ్తే బెటర్ అని భావిస్తున్నారు. ఓదెల 2 కథ ఇదివరకు చాలా సినిమాల కథలను పోలి ఉ ందన్న టాక్ ఉన్నా తమన్నా ఇలానే ఫిమేల్ సెంట్రిక్ కథలతో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేసే పాత్రలు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నారు. తమన్నాలో ఉన్న అసలు నటి ఇలాంటి సినిమాలు చేసినప్పుడు మాత్రమే బయటకు వస్తుంది. ఐతే ఓదెల 2 సినిమా చేస్తున్న టైం లో తమన్నా కూడా ఇక మీదట లేడీ ఓరియెంటెడ్ సినిమాలే అది కూడా కాస్త డిఫరెంట్ గా ఉండేలా ప్లాన్ చేయాలని అనుకున్నదట. ఓదెల 2 అటెంప్ట్ కి తమన్నా వరకు మంచి మార్కులే పడ్డాయి. ఐతే నెక్స్ట్ సినిమాల్లో కథా బలం కూడా బాగుండే సినిమాలు చేస్తే తను పెట్టే ఎఫర్ట్ కి మించిన రిజల్ట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది.



ఐతే ఇన్నేళ్ల కెరీర్ లో ఇప్పటికీ తమన్నాని లీడ్ రోల్ లో పెట్టి సినిమాలు చేస్తున్నారు

# స్టార్ హీరో డాటర్.. స్టన్ అయ్యేలా

బాలీవుడ్ సినిమా ప్రపంచంలో ఇటీవల కాలంలో స్టార్ హీరోలకు సంబంధించిన ఫ్యామిలీ మెంబర్స్ సినిమాల్లోకి కాస్త ఎక్కువగానే ఎంట్రీ ఇస్తున్నారు. ముఖ్యంగా స్టార్ డాటర్స్ అయితే నేటితరం గ్లామర్ హీరోయిన్స్ కి ఏ మాత్రం తక్కువ కాకుండా అడుగుపెడుతూ ఉండడం విశేషం. ఇక గత కొంత కాలంగా సైఫ్ అలీ ఖాన్ కూతురు కూడా గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును అందుకునే విధంగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న ఫోటోలకు కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఎలాంటి ఫోటోలు పోస్ట్ చేసిన కూడా నిమిషాల్లో వైరల్ అవ్వాల్సిందే. సారా అలీ ఖాన్ ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీ లో చాలా బిజీగా ఉన్న హీరోయిన్స్ లలో ఒకరు. మొదట బద్రీనాథ్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ ఆ తర్వాత సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా నేటి తరం యువ హీరోలతో అవకాశాలు అందుకుంటోంది. ఇక అప్పుడప్పుడు బికినీ అందాలతో కూడా షాక్ ఇస్తోంది. సోషల్ మీడియాలో కూడా ఈ బ్యూటీకి ఈ మధ్యకాలంలో ఫ్యాన్ ఫ్లవర్స్ ఒక్కసారిగా పెరిగి పోయారు. ఆమె పోస్ట్ చేస్తున్న ఫోటోలు చూస్తే ఎవరికైనా సరే దిమ్మతిరగాల్సిందే. రీసెంట్ గా మోకాళ్ళ మీద కూర్చుని ఉన్న ఒక ఫొటోలో చాలా స్టైలిష్ గా కనిపించింది. సారా గతంలో ఎప్పుడూ లేని విధంగా దర్శనమివ్వడంతో పాటు పాటు ఒక అర్థవంతమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. నేను నా



మోకాళ్ళమీద లేను.. కానీ ప్రస్తుతం డైమండ్స్ దొరుకుతున్నాయి అంటూ వివరణ ఇచ్చింది.

# జిల్లనిపించిన గురు బ్యూటీ



విక్టరీ వెంకటేష్ నటించిన గురు చిత్రంతో తెలుగు వారికి పరిచయమైంది రితికా సింగ్. పాత్ర స్వభావానికి తగ్గట్టు రితిక మాస్ అప్పీల్ రఫ్ నేచుర్ ఆ మూవీకి పెద్ద ప్లస్ అయ్యాయి. నటిగా మంచి మార్కులే వేసారు క్రిటిక్స్. కానీ ఎందుకనో రితిక తెలుగు సినీపరిశ్రమలో క్లిక్ కాలేదు. ప్రస్తుతానికి తమిళంలోనే అడపాదడపా నటిస్తోంది. ఏడాది కాలంగా ఆశించినంత పెద్ద అవకాశాల్ని అయితే అందుకోలేదు. అయితే ఇతర నాయికలకు ధీటుగా సోషల్ మీడియాలో కొన్ని టీజింగ్ వీడియోలు ఫోటోలను షేర్ చేస్తూ అభిమానుల్ని ఆటపట్టిస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com